క్లుప్తంగా

శ్రీజగన్నాథస్వామి వార్షిక బ్రహ్మోత్సవం



చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): శ్రీసుభద్రా, బలభద్రా సహిత శ్రీజగన్నాథస్వామి 11వ వార్షిక బ్రహ్మోత్సవ వేడుకలు ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా శనివారం ఉదయం నిత్యార్చన, బలిహరణ, తీర్థప్రసాదవితరణ నిర్వహించారు. నరసరావుపేట యిన్నలూరి రామబ్రహ్మం హనుమాన్ భక్త బృందంచే 108 సార్లు సామూహిక హనుమాన్‌చాలీసా పారాయణం నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో రాధాకృష్ణులు కల్యాణ మహోత్సం అనంతరం తీర్థ ప్రసాదం అందించారు.

అబ్బరాజుపాలెం చెరువు అభివృద్ధికి కృషి



పెదకూరపాడు: ప్రజల తాగునీటి అవసరాలను తీర్చడంతో పాటు.. ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించేందుకు ప్రత్యేక కార్యచరణ చేపట్టినట్లు పల్నాడు డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ తెలిపారు. మండలంలోని అబ్బరాజుపాలెం గ్రామంలో చెరువు పూడికతీత, అభివృద్ధి పనులను ఎంపీడీవో నరసింహరావుతో కలసి పరిశీలించారు. అమృత్ సరోవర్ పథకం కింద మండలంలోని పెదకూరపాడు, అబ్బరాజుపాలెం చెరువులను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఏపీవో కోటేశ్వరరావు ఉన్నారు.

నేడు సీతారాముల విగ్రహ ప్రతిష్ట మహోత్సవం



పెదకూరపాడు: మండలంలోని 75 త్యాళ్ళూరు గ్రామంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. వరుసగా దేవతా మూర్తుల విగ్రహ ప్రతిష్ఠలు, నూతన దేవాలయ నిర్మాణం జరుగుతోంది. ఆదివారం నూతనంగా నిర్మించిన రామాలయంలో అన్నపూర్ణాంబిక సమేత కాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానం, శ్రీ షిర్డీసాయిబాబా ఆలయం ప్రతిష్ఠాపనకు ఆలయ నిర్మాణ నిర్వహణ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. 5న సీతరాములు, లక్ష్మణ, ఆంజనేయ స్వామి, గరుడ, 8న నూతనంగా నిర్మించిన సాయిబాబా దేవాలయంలో విగ్రహప్రతిష్ఠ, 10న శివాలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు జరుగనున్నాయి.

రాజ్యాంగ రచనలు తెలుసుకునేందుకు పోటీలు దోహదం



సత్తెనపల్లి: డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ రాసినటువంటి రాజ్యాంగ రచనలను విద్యార్థులకు తెలియజేయడానికి క్విజ్, వ్యాసరచన పోటీలు దోహద పడతాయని వెన్నాదేవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి. మల్లికార్జునరావు అన్నారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన జనవరి 26వ తేదీన రాజ్యాంగంపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లోని విజేతలకు శనివారం బహుమతులు ప్రధానం చేశారు. హెచ్ఎమ్ మల్లికార్జునరావు మాట్లాడుతూ దళిత బహుజన రిసోర్స్ సెంటర్ స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న కార్యక్రమాలు చాలా ఉపయోగకరమైనవన్నారు. భారత రాజ్యాంగంలో ఉన్నటువంటి హక్కుల అవకాశాల గురించి బాలల కోసం వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంస్థ డైరెక్టర్ అల్లడి దేవ కుమార్‌కి ప్రధానోపాధ్యాయుల బృందం కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయుడు నెలటూరి రమేష్ మాట్లాడారు. అనంతరం గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు, స్కూల్‌కి బెస్ట్ అవార్డుగా ఉపాధ్యాయులు, సిబ్బందికి అందించారు. కార్యక్రమంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఉమ్మడి గుంటూరు జిల్లా కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప, స్కూల్ ఉపాధ్యాయులు గడ్డం రాజేంద్రకుమార్, వి. శివచ్ఛాయ, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

కస్తూర్బా బాలికలకు వైద్య పరీక్షలు

రాజుపాలెం: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ రవితేజనాయక్ బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించారు. అనారోగ్యంతో ఉన్నవారికి వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. అనంతరం బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. పౌష్టికాహారాన్ని సకాలంలో తీసుకోవాలని సూచించారు.

గృహసారథులే గెలుపు వారధులు

- సంక్షేమ ఫలాలను ప్రతి ఒక్కరికి వివరించండి
- మంత్రి అంబటి రాంబాబు
- సత్తెనపల్లి రూరల్ మండల గృహసారథులు, కన్వీనర్ల సమావేశం



మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు, మర్రి రాజశేఖర్, వెన్నా హనుమారెడ్డి

సత్తెనపల్లి: గృహ సారథులే వైఎస్సార్ సీపీ గెలుపు వారధులని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సత్తెనపల్లి రూరల్ మండల గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మంత్రి మాట్లాడుతూ ఎన్నికల యుద్ధానికి సైన్యం సిద్ధంగా ఉందని, జగనన్న రథచక్రాల కింద పవన్‌కళ్యాణ్, చంద్రబాబులు తునాతునకలు కావడం ఖాయమన్నారు. ఎంతమంది ఏకమైనా జగన్ విజయాన్ని ఎవరు ఆపలేరని స్పష్టం చేశారు. విజయ సంకల్పంతో కార్యోన్ముకులు కావాలని పిలుపునిచ్చారు. దేశంలో ఎక్కడా లేని అద్భుతమైన వ్యవస్థ క్షేత్రస్థాయిలో మనకు ఉందని, దీన్ని వినియోగించుకుందామన్నారు. గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, జెసిఎస్ ఇన్‌చార్జిలు సమష్టిగా పనిచేస్తే విజయ డంకా మోగుతుందన్నారు. కులాలు, మతాలు, ప్రాంతాలు, పార్టీలకు, అతీతంగా సంక్షేమ పథకాలు అందించడమే కాక, అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పనిచేస్తున్నారన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న అందిస్తున్న సంక్షేమ ఫలాలను వివరించాలన్నారు.

టీడీపీ అనుకూల మీడియా ద్వారా దుష్ప్రచారాలు....

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలన చూసి టీడీపీ తన అనుకూల మీడియా ద్వారా ప్రభుత్వం పై బురద జల్లే ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. వారి దుష్ప్రచారాలను తిప్పి కొట్టి ప్రజలకు వాస్తవాలను వివరించాలని గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులకు సూచించారు. పార్టీ కోసం కష్టపడి పని చేసే వారికి పార్టీలో తగిన గుర్తింపు లభిస్తోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశాం కాబట్టే ఈ రోజు ప్రజల మధ్యకు వెళ్లి ధైర్యంగా చెప్పుకో గలుగుతున్నామన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు లంచాలు లేనిదే ఏ పని జరిగేది కాదని, దోచుకోవడం.. దాచుకోవడమే లక్ష్యంగా పనిచేశారన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన మేలును వివరించి ఓట్లు అడుగుదామని, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు సైనికులా పనిచేయాలన్నారు. గుంటూరు, కృష్ణ ,ఎన్టీఆర్ జిల్లాల ప్రాంతీయ సమన్వయకర్త మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ అధికారం మళ్లీ మనదేనని, రానున్నది జగనన్న ప్రభుత్వమేనని, క్షేత్రస్థాయిలో కార్యకర్తలు నాయకులు, సమన్వయంతో సమర్థవంతంగా పని చేయాలన్నారు. పారదర్శక సంక్షేమం, సుపరిపాలన సాగాలంటే ఈ ప్రభుత్వం మళ్ళీ రావాలన్నారు. అది మీ చేతుల్లోనే ఉందన్నారు. ప్రతి గడప గడపకు అంబటి రాంబాబు సుపరిచితమేనని, ఇక్కడ రాంబాబును రాష్ట్రంలో జగన్‌ను గెలిపించాలని కోరారు. పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గీతా హసంతి మాట్లాడుతూ మహిళా సాధికారతకు ఈ ప్రభుత్వం నిదర్శనమన్నారు. నియామక పదవుల్లోనూ అత్యధిక శాతం మంది మహిళలు ఉండడం అభినందనీయమన్నారు. నియోజకవర్గ పరిశీలకులు వెన్నా హనుమారెడ్డి మాట్లాడుతూ అందరూ సమన్వయంతో కలిసి పనిచేయాలన్నారు. 98 శాతం హామీలు అమలు చేసిన ఘనత యువ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. మంత్రిగా ఉంటూనే నిత్యం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటున్న అంబటి రాంబాబును మీరందరూ బలపరచాలని కోరారు. సమావేశంలో సత్తెనపల్లి రూరల్ మండల పార్టీ కన్వీనర్ రాయపాటి పురుషోత్తమరావు, రాష్ట్ర వ్యవ సాయ సలహా మండలి సభ్యులు కళ్ళం విజయ భాస్కర రెడ్డి, జెడ్పీటీసీ సంకటి నాగేశ్వరమ్మ, జేసియస్ మండల ఇన్‌చార్జ్ చిలుకా జయపాల్, నాయకులు యలవర్తిపాటి ఈసా, కట్టా సాంబయ్య, ధూళిపాళ్ల ది ఆంధ్రా బ్యాంక్ చైర్మన్ నలబోతు శివన్నారాయణ, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, తదితరులు ఉన్నారు.



సమావేశానికి హాజరైన గృహసారథులు, కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు

చలో ఢిల్లీ కరపత్రం విడుదల

సత్తెనపల్లి: మోడీ పాలన బడా కార్పొరేట్లకు అనుకూలంగానే కొనసాగుతుందా, లేక కార్మిక కర్షకులకు అనుకూలంగా వ్యవసాయ సంక్షోభావాన్ని పరిష్కరిస్తుందా, పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా నిలదీద్దాం రండి అంటూ వ్యవసాయ కార్మిక సంఘం పట్టణంలోని పుతుంబాక భవన్‌లో శనివారం వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి అనుముల లక్ష్మీశ్వర రెడ్డి చలో ఢిల్లీ కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల వ్యవసాయం నానాటికి సంక్షోభ సుడి గుండంలో పడిపోతుందని, భూమి పరాయి కరణ అవుతుందని, కేవలం గిట్టుబాటు కాక, కౌలుకు తీసుకునేవారు కూడా లేక లక్షలాది ఎకరాల భూమి పల్నాడు జిల్లాలో పడవుగా మారిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు.వ్యవసాయ కూలీలకు చేతినిండా పని లేక, వ్యవసాయేతర పనులు వెతుక్కుంటున్నారని, పొట్ట చేత పట్టుకుని పని కోసం వలసలు పోయే వారి సంఖ్య పెరిగిపోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం జాతి సంపదను అంబానీ, ఆదాని వంటి బడా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్నదని, అందుకే పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా మోడీ ప్రభుత్వాన్ని నిలదీయడం కోసం తమ సంఘం చలో ఢిల్లీ కార్యక్రమానికి పిలుపునిచ్చిందన్నారు. ఏప్రిల్ 5న ఢిల్లీలో జరగనున్న కార్మిక, కర్షక ర్యాలీకి పల్నాడు జిల్లా నుంచి 200 మంది పైగా వ్యవసాయ కార్మికులు ఢిల్లీ ర్యాలీకి హాజరవుతున్నారని ఆయన తెలిపారు. ప్రజానీకం పెద్ద ఎత్తున మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిఐటియు సత్తెనపల్లి పట్టణ కార్యదర్శి ఎం హరిపోతురాజు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, తదితరులు ఉన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

వ్యక్తి మృతి

సత్తెనపల్లి: బార్ అండ్ రెస్టారెంట్ ఆవరణలో వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం పట్టణంలో జరిగింది. పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో గల ఓ బార్ అండ్ రెస్టారెంట్ ఆవరణలో శనివారం ఉదయం మద్యం కోసం వెళ్లిన పట్టణానికి చెందిన శ్రీనివాసరావు (50) కుర్చీలో కుర్చొని కొద్దిసేపటికే స్పృహ తప్పగా స్థానికులు సమాచారంతో ఆయన సోదరుడు వైద్యశాలకు తీసుకు వెళ్లగా మృతి చెందాడు. మృతుని సోదరుడు ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నారు.

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలి

నకరికల్లు: ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు, పురుగుమందులు విక్రయించాలని లేకుంటే లైసెన్సులు రద్దుచేస్తామని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు హెచ్చరించారు. మండలంలోని పలు ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో శనివారం తనిఖీలు చేశారు. రికార్డులు పరిశీలించారు. ఎరువులు, పురుగుమందుల నిల్వలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీకన్నా అధిక ధరలకు విక్రయిస్తే ఎఫ్‌సిఓ 1985 చట్టం ప్రకారం దుకాణదారుల లైసెన్సులు రద్దుచేస్తామని అన్నారు. అమ్మిన ఎరువులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

డిమాండ్‌కు సరిపడా ఎరువుల నిల్వలు

రబీసీజన్‌లో సాగవుతున్న పంటల డిమాండ్‌కు తగినట్లుగా ఎరువుల నిల్వలు సిద్ధం చేసినట్లు మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు తెలిపారు. మండలంలోని పలుగ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాలకు శనివారం ఎరువులను దిగుమతి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా 420.5 మెట్రిక్‌టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 394.25 మెట్రిక్ టన్నులు, డీఏపి 222.05 మెట్రిక్ టన్నులు, ఎంఒపి 25.05 మెట్రిక్‌టన్నులు, ఎస్ఎస్‌పి 25.65 మెట్రిక్‌టన్నులు మొత్తం 1096.95మెట్రిక్ టన్నుల ఎరువులు డీలర్ల వద్ద సిద్ధంగా ఉన్నాయని అన్నారు. అలాగే 170టన్నుల యూరియా, 30టన్నుల డిఏపి కలిపి మొత్తం 200మెట్రిక్ టన్నుల ఎరువులను రైతుభరోసాకేంద్రాల ద్వారా రైతులకు పంపిణీ చేస్తామని అన్నారు. చీమలమర్రి 20మెట్రిక్‌టన్నులు, రూపెనగుంట్ల 22మెట్రిక్‌టన్నులు, కండ్లకుంట 20 మెట్రిక్ టన్నులు, గుండ్లపల్లి 10మెట్రిక్ టన్నుల ఎరువులు ఇప్పటికే సిద్ధంగా ఉన్నాయని, ఆదివారం మరింతగా ఎరువుల నిల్వలు అందుబాటులోకి వస్తాయన్నారు. వరిలో ఎకరాకు 72కేజీల నత్రజని, యూరియా 156కేజీలు, 36కేజీల భాస్వరం, 78కేజీల డిఏపి, 24కేజీల పొటాష్, ఎంఓపి 40కేజీలు మూడుదఫాలుగా వేస్తే సరిపోతుందని అన్నారు. మొక్కజొన్నలో ఎకరాకు 96కేజీల నత్రజని, 208కేజీల యూరియా, 32 కేజీల భాస్వరం, 70కేజీల డిఏపి, 32కేజీల పొటాష్, 53కేజీల ఎంఓపి వినియోగిస్తే సరిపోతుందని అన్నారు. అవసరానికి మించి ఎరువులు అధికంగా వినియోగిస్తే చీడపీడల బాధ ఎక్కువగా ఉంటుందని, వ్యవసాయశాఖ సూచనల మేరకు మాత్రమే ఎరువులు వినియోగిస్తే తక్కువ ఖర్చులో నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని అన్నారు.

పశువులకు అత్యవసర చికిత్స

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అమరావతి: పశువులకు కూడా అత్యవసర చికిత్స అందించేందుకు సంచార పశువైద్య అంబులెన్స్‌లను ప్రభుత్వం రూ.18లక్షలు ఖర్చు చేసి ఏర్పాటు చేయడం జగరిగిందని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. శనివారం మండల పరిధిలోని ధరణికోట పశు వైద్యశాల వద్ద అమరావతి, పెదకూరపాడు మండలాలకు కేటాయించిన పశు వైద్య అంబులెన్స్‌ను జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకరరావు మాట్లాడుతూ రెండు మండలాల ప్రజలు అత్యవసర పశు వైద్యానికి కాల్ సెంటర్ నెం1962కు కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అమరావతి, పెదకూరపాడు మండలాల పశువైద్యాధికారులు కె.వెంకట్రామయ్య, సారథిబాబు, ప్రభావతి, పూర్ణచరణ్, మల్లయ్య, సర్పంచ్ మాదాసు పావని, ఎంపీటీసీ కంభంపాటి శాంతమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



అంబులెన్స్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకరరావు

వైద్య శిబిరాలను బాలికలు వినియోగించుకోవాలి

సత్తెనపల్లి: ఉచిత వైద్య శిబిరాలను బాలికలు వినియోగించుకోవాలని వార్డ్ హెల్త్ సెక్రటరీ బి. రత్న పుణ్యవతి అన్నారు. పట్టణంలోని బీసీ బాలికల వసతి గృహంలో శనివారం హిమోగ్లోబిన్ శాతం కోసం 50 మంది బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా పది సంవత్సరాల వయసు నుంచి 19 సంవత్సరాల వయసు గల బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించారు. రక్తం వృద్ధి చెందడానికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్త ఏ ప్రియాంక, వడవల్లి యూపీహెచ్‌సీ ల్యాబ్ టెక్నీషియన్ కె.రవికుమార్, ఫార్మసిస్ట్ పి.అన్వర్ హుస్సేన్ ఖాన్, వార్డెన్ బి.సంగీత, తదితరులు ఉన్నారు.



వైద్యశిబిరంలో సూచనలు చేస్తున్న వార్డ్ హెల్త్ సెక్రటరీ రత్నపుణ్యవతి

ఏ సమస్య ఉన్నా నిర్భయంగా తెలియజేయాలి

సత్తెనపల్లి: పిల్లలకు ఏ సమస్య ఉన్నా నిర్భయంగా తెలియజేయాలని సత్తెనపల్లి ఉప విద్యాశాఖ అధికారి వి.వెంకటేశ్వరరావు చెప్పారు. పట్టణంలోని వెంగళరెడ్డి నగర్‌లో గల భవిత సెంటర్‌లో సత్తెనపల్లి నియోజకవర్గస్థాయి ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉచిత సహాయ ఉపకరణల కోసం శనివారం వైద్య నిర్ధారణ శిబిరం సమగ్ర శిక్ష పల్నాడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. డీవైఈఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల విద్యాశాఖ అధికారి ఏ.శ్రీనివాసరావు మాట్లాడుతూ నాలుగు విభాగాలైన సైకాలజిస్ట్, ఆర్థో, ఈఎన్‌టీ, ఆప్తమాలజీలకు సంబంధించిన వైద్య నిపుణుల సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటిని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏఎల్ఎస్‌సీ కోఆర్డినేటర్ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ శిబిరంలో వైద్యులు అవసరమైన వారికి కావలసిన ఉపకరణాలు అలిమ్‌కో కంపెనీ ద్వారా ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ్ కుమార్ (ఆర్థో), తనుజ ఫణికుమార్ (ఆప్తమాలజీ), ఎస్.చంద్రబాబు (సైకాలజిస్ట్), జి.మణికంఠ, జి.గ్రేస్, కె.కుమారి, ఐఈఆర్‌టీ ఉపాధ్యాయులు, ఆయాలు, తల్లిదండ్రులు,సీఆర్పీలు, ఎంఆర్సీ సిబ్బంది, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండల విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు, డీవైఈఓ వెంకటేశ్వరరావు

నార్నెపాడు సచివాలయం తనిఖీ

నార్నెపాడు(ముప్పాళ్ళ): మండలంలోని నార్నెపాడు, పలుదేవర్లపాడు గ్రామ సచివాలయాలను ఎంపీడీఓ పి.పుట్టారెడ్డి శనివారం తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా సిబ్బంది హాజరును పరిశీలించారు. వలంటీర్లు, సిబ్బంది సమయపాలన పాటించాలని, తప్పనిసరిగా మూడు సార్లు హాజరు నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం అర్జీల రిజిష్టర్‌ను పరిశీలించారు. పెండింగ్ లేకుండా చూసుకోవాలని, అందించే సేవలు కూడా పారదర్శకంగా ఉండాలన్నారు. ఆయనతో పాటుగా ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.



సచివాలయంలో సిబ్బంది అందిస్తున్న సేవలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ పుట్టారెడ్డి

జగనన్న నమ్మకాన్ని నిలబెట్టండి..

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అమరావతి: ప్రజల వద్దకే పాలనను తీసుకొచ్చేందుకు నియమించిన గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు జగనన్న నమ్మకాన్ని నిలబెట్టాలని, పేదల పక్షాన నిలవాలని ఎమ్మెల్యే శంకరరావు పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని ధరణికోట జేబీ గార్డెన్స్‌లో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లకు నిర్వహించిన రెండు విడతల శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రసంగించారు. ఈ సమావేశానికి మండల సచివాలయాల కన్వీనర్ భవిరిశెట్టి హనుమంతరావు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే శంకరరావు మాట్లాడుతూ.. అన్ని ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అన్ని సేవలను, పథకాలను ప్రజల ముంగిటకు తెచ్చి.. అభివృద్ధి ఫలాలను అందించటంలో ఎటువంటి పొరపాట్లు లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అంకిత భావంతో పని చేసి.. ప్రభుత్వానికి, పార్టీకి కొండంత అండగా నిలవాలన్నారు. పెదకూరపాడు నియోజవకవర్గంలో రూ.1,200కోట్లతో సంక్షేమ పథకాలు ప్రజలకు అందించినట్లు ఈ సందర్భంగా తెలిపారు. ప్రతి నెలా 1వ తేదీన పింఛను పంపిణీ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు వలంటీర్లు పాల్గొని, ప్రభుత్వ పథకాలను వారికి వివరించాలన్నారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా, అర్హులైన వారికి వెంటనే సంక్షేమ పథకాలు అందేలా గృహ సారథులు కృషి చేయాలని చెప్పారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు క్షేత్రస్థాయిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, తనకు రెండు కళ్లు అని అభివర్ణించారు. ఈ సమావేశంలో పెదకూరపాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు పైలా స్వామినాయుడు మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పరిపాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ప్రజలందరూ మరోసారి ఆశీర్వదించాల్సిన అవసరం ఉందన్నారు. ఇచ్చిన హామీలు 98 శాతం నెరవేర్చినప్పుడు ఇప్పటి నుంచే 175 సీట్లు గెలవటానికి క్షేత్రస్థాయిలో పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా గృహ సారథులకు, కన్వీనర్లకు నిర్వహించాల్సిన విధులపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సమావేశంలో, డీసీసీబీ డైరక్టర్ కోట హరిబాబు, క్రోసూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వెంపాజ్వాల లక్ష్మీనరసింహరావు, మండల పార్టీ అధ్యక్షుడు మంగిశెట్టి శ్రీనివాసరావు, జడ్పీటీసీ కరుణకుమారి, జడ్పీ కో–ఆప్షన్ మెంబర్ షేక్ హాష్మీ,, వైఎస్సార్ సీపీ నాయకులు మంగిశెట్టి కోటేశ్వరరావు, నిమ్మా విజయసాగరబాబు, అళ్ళ శ్రీనివాసరెడ్డి, కొండవీటి కోటేశ్వరరావు ప్రసంగించారు. చిలకా సాంబయ్య, అలా లక్ష్మీనారాయణ, సర్పంచ్‌లు కాశిమాల పేరయ్య, వింతా శ్రీలక్ష్మీ, నాయుడు రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



కన్వీనర్లు, గృహ సారథులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంబూరు

అమృతసరోవర్ కింద 80 చెరువుల అభివృద్ధి

డ్వామా పీడీ జి.జోసఫ్‌కుమార్

అచ్చంపేట: పల్నాడు జిల్లాలో అమృతసరోవర్ కింద 80 చెరువులు మంజూరు చేసినట్లు డ్వామా పీడీ జి.జోసఫ్‌కుమార్ చెప్పారు. వీటిలో 19 పూర్తిచేసినట్లు తెలిపారు. ఇందుకుగాను రూ.1.02కోట్లు వెచ్చించామని, మిగిలిన 61 చెరువులు వివిధ దశలలో ఉన్నట్లు తెలిపారు. వాటికి రూ.6.52 కోట్లు కేటాయించామని చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం జరిగిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఆయన పాల్గొన్నారు. అచ్చంపేట మండలం కోనూరులోని ఐదెకరాల విస్తీర్ణంగల చెరువును అభివృద్ధి చేసేందుకు పనులు ప్రారంభించినట్లు తెలిపారు. మెటల్ కాంపోనెంట్ కింద రూ.2లక్షలు కేటాయించామన్నారు. 2021–22 ఆర్థిక సంవత్సరంలో అచ్చంపేట మండలంలో ఉపాధి హామీ పథకం కింద 652 పనులు చేసినట్లు చెప్పారు. వేతనాల రూపంలో రూ.5,11,50,668 ఖర్చు చేయగా, మెటీరియల్ కాంపోనెంట్ రూపంలో రూ.1,90,72,408లతో కలపి మొత్తం రూ.7,02,23,076 కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. స్వల్ప తేడాలు మినహా పనులు సక్రమంగానే జరిగాయన్నారు.

చనిపోయిన మొక్కల స్థానంలో కొత్తవి నాటాలి

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 21–22 ఆర్థిక సంవత్సరంలో నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యత కూడా నిర్వాహకులదేనని, మొక్కలు చనిపోవడానికి కారణమైన వారే తిరిగి నాటాలని డ్వామా పీడీ గంగవరపు జోసఫ్‌కుమార్ అన్నారు. చింతపల్లి, తాడువాయి, మాదిపాడు, కోగంటివారిపాలెం, తాళ్లచెరువు గ్రామాలలో నాటిన మొక్కలు చనిపోవడం జరిగిందని వెంటనే తిరిగి నాటాలన్నారు. రికార్డులు రాయడంలో నిర్లక్ష్యం వహించిన చల్లగరిగ, చింతపల్లి, తాడువాయి, కోగంటివారిపాలెం గ్రామాల ఫీల్డు అసిస్టెంట్లకు ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున జరిమానాలు విధించారు. గ్రామాల వారీగా జరిగిన ఉపాధి పనులపై తనిఖీ బృందాలు నివేదికలు సమర్పించాయి. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏపీఓ నాగశ్రీనివాస్, ఎస్సార్పీ రవికుమార్, పంచాయతీరాజ్ ఏఈ శేషప్పయ్య, వివిధ జిల్లాల నుంచి వచ్చిన డీఆర్పీలు పాల్గొన్నారు.



సామాజిక తనిఖీ నివేదికలు పరిశీలిస్తున్న డ్వామా పీడీ జోసఫ్‌కుమార్

నేడు ఓర్వకల్లు గంగమ్మతల్లి తిరునాళ్లు

అచ్చంపేట: మండలంలోని ఓర్వకల్లులో స్వయంభుగా వెలసిన గంగాదేవి పేరంటాల తిరునాళ్ల ఆదివారం నిర్వహించేందుకు నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. ఏటా మాఘశుద్ధ పౌర్ణమి నాడు అమ్మవారి తిరునాళ్లను నిర్వహించడం ఆనవాయితీ. పెదకూరపాడు నియోజకవర్గంలో జరిగే అతి పెద్ద తిరునాళ్లలో అమ్మవారి తిరునాళ్ల ఒకటి. ఓర్వకల్లు, రుద్రవరం, గ్రంథశిరి గ్రామాల్లో ఉత్సవాలు జరుగుతాయి. కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా, పాడిపంటలకు ఇలవేల్పుగా, సంతాన లక్ష్మిగా ఈ ప్రాంత ప్రజలు అమ్మవారిని కొలుస్తారు.

గంగమ్మతల్లి ప్రాశస్త్యం

సుమారు వెయ్యేళ్ల క్రితం ఓర్వకల్లు గ్రామంలోని 150 అడుగుల ఎత్తైన కొండ గుహలో గంగమ్మతల్లి వెలసినట్లు చరిత్ర చెబుతోంది. విజయవాడ కనక దుర్గమ్మ తల్లికి ఎంతటి ప్రాముఖ్యత ఉందో ఓర్వకల్లు గంగమ్మతల్లికీ అంతే మహత్యం ఉందని భక్తుల విశ్వాసం. ముఖ్యంగా సంతానం లేని దంపతులు అమ్మవారిని దర్శించుకుని.. ఆలయ ప్రాంగణంలో నిద్ర చేస్తే సంతాన సాఫల్యమవుతుందని నమ్మకం.



భక్తులు అమితంగా విశ్వసించే గంగమ్మతల్లి

ప్రత్యేక పూజలు

అమ్మవారికి ఉదయాన్నే ప్రత్యేక పూజలు జరుగుతాయి. అమ్మవారి దర్శనం, ముద్రపూలు ఉత్సవాలు, జనివాడ చదరంగం, గంగవేషం, శిడిమాను ఉత్సవం, పోలేరు, కల్లిపాటు, దీనబరారు నిర్వహిస్తారు.

పటిష్ట బందోబస్తు

ఆలయం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అచ్చంపేట ఎస్ఐ కె.పాల్ రవీంద్ర ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అచ్చంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం వద్ద ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహిస్తారు.

అడిషనల్ ఎస్పీ విజయభాస్కరరెడ్డికి సత్కారం

సత్తెనపల్లి: అడిషనల్ ఎస్పీగా ఇటీవల ఉద్యోగోన్నతి పొందిన రామిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి శనివారం పట్టణంలోని శ్రీ దుర్గా అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలకు హాజరయ్యారు. వేదపండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు. అనంతరం అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బగ్గి నరసింహారావు నేతృత్వంలో వైఎస్సార్ సీపీ నాయకులు, ఆర్యవైశ్య సంఘ నాయకులు విజయభాస్కరరెడ్డిని సత్కరించారు. విజయభాస్కరరెడ్డి 2019 జులై 22 నుంచి 2022 డిసెంబర్ 15 వరకు సత్తెనపల్లి డీఎస్పీగా పనిచేసి ఉద్యోగోన్నతి పొందారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల హనుమంతరావు, షేక్ గని, శిరిగిరి వెంకట్రావు, దాసరి తిరుపతిరావు, న్యాయవాది పొత్తూరి హరీష్‌కుమార్, ఆర్యవైశ్య సంఘ నాయకులు తూనుగుంట్ల కాశి, కొత్తూరి విశ్వేశ్వరరావు, రెడ్డి శ్రీను, తదితరులు ఉన్నారు.



విజయభాస్కరరెడ్డిని సత్కరిస్తున్న ఏపీపీ బగ్గి నరసింహారావు, నాయకులు